జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISH IN HYDERABADH | సంపుటి : 01 సంచిక : 200 | SANDESHAM TIMES | మంగళవారం 16 - 12 - 2025 | SANDESHAM TIMES TELUGU DAILY

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.



# యావత్ తెలుగు ప్రజల ఆస్తి

**పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరు 'వాసవీ పెనుగొండ'గా మార్పు**

**పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని 'డే ఆఫ్ శాక్రిఫైస్'గా ప్రకటన**

**అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి**

**గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అపహాస్యం చేసింది**

**పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన సీఎం**

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు. ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం,

మిగతాది 2 లో...

# రైతులకు రూ.503 కోట్లు విడుదల



**రైతులకు రూ.503 కోట్లు విడుదల**

- తెలంగాణ రైతులకు శుభవార్త..
- వేల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.503 కోట్ల
- ఈ డబ్బులు దేనికి సంబంధించినవి అంటే ధాన్యం కొనుగోళ్లకు
- ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నిధులను వేలాది మంది రైతుల ఖాతాలో జమ

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** తెలంగాణ రైతులకు శుభవార్త.. మీ ఖాతాలో ప్రభుత్వం డబ్బులు జమ చేసింది.. చెక్ చేసుకోండి. వేల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.503 కోట్ల రూపాయలు జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరి ఇంతకు ఈ డబ్బులు దేనికి సంబంధించినవి అంటే ధాన్యం కొనుగోళ్లకు చెందినవి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నిధులను వేలాది మంది రైతుల ఖాతాలో జమ చేసింది. ఇప్పటికి 85 శాతం చెల్లింపులు పూర్తయ్యాయి. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయం చేయడం మాత్రమే కాక.. మద్దతు ధర, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. అలానే కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు విడుదల చేస్తూ.. రైతుల కళ్లలో సంతోషం నింపుతోంది. తాజాగా రేవంత్ సర్కార్ రైతులకు శుభవార్త చెప్పింది. వారి ఖాతాలో రూ.503 కోట్లు జమ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వర్షాకాలానికి సంబంధించి.. ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుంది. ఈ జిల్లాలో మెట్ట

మిగతాది 2 లో...

# పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

**కేతిరెడ్డి ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి**

**అక్రమ నిర్మాణాలు నిరూపిస్తే కూల్చేందుకు సిద్ధమని ప్రకటన**

**రేపు పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం ఇస్తామన్న జేసీ**



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. భూకబ్జా ఆరోపణలపై పెద్దారెడ్డి చేసిన ఫిర్యాదుకు జేసీ ప్రభాకర్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. ఆరోపణలు

మిగతాది 2 లో...

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్ నియామకం ...
- నేడు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘన స్వాగతం పలికిన అధిష్ఠానం
- మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నడ్డా, అమిత్ షా సూచన
- ఈ పదవిని చేపట్టిన వారిలో అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచిన నబిన్

2




**జాతీయం, సందేశం టైమ్స్ :** బీజేపీ నూతన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబిన్ సోమవారం ఢిల్లీలో లాంఛనంగా

# కాంగ్రెస్ కు కాలం చెల్లిందని పల్లె ప్రజలు ఓటుతో తేల్చిచెప్పారు

**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు పరాభవం తప్పదని జోస్యం**

**రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ హర్షం**

**రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**

**గ్యారెంటీల అమలులో వైఫల్యమే కాంగ్రెస్ ఓటమికి కారణమన్న కేటీఆర్**

**మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని వ్యాఖ్య**

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచక పాలనకు చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్



# రూ.1000 కోట్ల ప్రాజెక్టులు సిద్ధం

**ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్**

**గత ప్రభుత్వం మోడల్ పోలీస్టేషన్లను నిర్లక్ష్యం చేసిందన్న మంత్రి అనిత**

**రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడి**

**రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ నిర్మాణం త్వరలో ప్రారంభం**



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** ఏపీలో మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణం గత ఐదేళ్లలో పూర్తిగా నిలిచిపోయిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. 2019కి ముందు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మోడల్ పోలీస్టేషన్లనే గత ప్రభుత్వం పట్టించుకోలేదని,

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

2

**జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే దిశగా సంకేతాలు**

**గ్రామస్థాయిలో జాగృతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్న కవిత**

**కొత్త పార్టీ పేరుపై నెటిజన్ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం**

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేశారు. 2029లో జరిగే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె నెటిజన్లతో 'ఆస్క్ కవిత' పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చారు. ఈ



# పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

చేయడం కాదు, దమ్ముంటే వచ్చి అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నాయో నిరూపించాలని పెద్దారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. ఎర్ర కాలువ, రహదారి నిర్మాణంపై కేతిరెడ్డి పెద్దారెడ్డి రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. "ఎర్ర కాలువ, రోడ్డు కోసం స్థల యజమానులతో మాట్లాడి ఏడు మీటర్ల స్థలాన్ని పంచాయతీరాజ్‌కు అప్పగించాం. నిధులు లేకపోవడంతో ఆ పనిని ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేశారు. వారు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఆ ప్రాంతంలోని భూమి మొత్తం ప్రైవేటు వ్యక్తులదే. వారే 20 మీటర్ల స్థలాన్ని రోడ్డు కోసం వదిలి ప్లాట్లు వేసుకున్నారు" అని జేసీ వివరించారు. అయితే, ఇందులో అక్రమ ప్లాట్లు ఎక్కడున్నాయో పెద్దారెడ్డి వచ్చి నిరూపించాలని జేసీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ తమ కౌన్సిలర్లు రేపు ఉదయం పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు. "పెద్దారెడ్డి వచ్చి ఏ నిర్మాణం అక్రమమని చూపిస్తే, దానిని కూల్చివేయడానికి నేను సిద్ధం" అని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.


# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

సందర్భంగా ఓ నెటిజన్.. "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, "ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ కవిత సమాధానమిచ్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. త్వరలోనే జాగృతి సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. జాగృతి సంస్థ ద్వారానే ఎన్నికల బరిలో నిలవబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 2047 నాటికి దేశ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన జీవిత లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. ఇదే తన విజన్, మిషన్ అని ఆమె పేర్కొన్నారు. కవిత తాజా ప్రకటనతో ఆమె భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై చర్చ మొదలైంది.

# రైతులకు రూ.503 కోట్లు విడుదల

ప్రాంతంలో వరి సాగు అధికంగా చేశారు. దీంతో ఈ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి మొత్తం 4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈక్రమంలో ప్రభుత్వం రైతుల వద్ద నుంచి 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఇప్పటివరకు 42,199 మంది రైతుల నుండి రూ.589.93 కోట్ల విలువైన 2,46,934.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు అధికారులు. ప్రభుత్వం కొనుగోలు చేసిన రైతుల్లో.. 39,857 మంది అన్నదాతలకు చెందిన 2,10,614.240 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.503.16 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు అధికారులు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సంబంధించిన చెల్లింపుల్లో 85 శాతం పూర్తయింది. ఈ సంవత్సరం ప్రారంభంలో అకాల వర్షాలు కురిసి.. రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. వరి కోతలు కోసిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతులు.. ఈ అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి చాలా కష్టపడ్డారు. తేమ శాతం పెరగడంతో.. తడిచిన ధాన్యాన్ని మళ్లీ కుప్పగా పోసి ఆరబెట్టడం కోసం కూలీలకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. అయితే, శీతాకాలం ప్రారంభం కావడంతో వాతావరణం అనుకూలించి, ధాన్యం తూకాలు వేగంగా జరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 239 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 2,34,856.620 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం. మరో 12077.540 మెట్రిక్ టన్నులుసన్నాలు. కొనుగోలు చేసిన మొత్తంలో.. 2,43,000.860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. ఇంకా 3933.300 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాల్సి ఉంది.

# చలనం లేని మున్సిపాలిటీ.




**జగ్గయ్యపేట,సందేశం టైమ్స్(డిసెంబర్ 16):** జగ్గయ్యపేట పట్టణంలో కోదాడ రోడ్ లోని డివైడర్ పైన ఉన్న సుమారు 20 మొక్కలను కట్ చేశారు.మిగతా మొక్కలను పట్టించుకోలేదు అని వచ్చే ఎండాకాలం నాటికీ మున్సిపాలిటీ పరిధి మొత్తాన్ని పచ్చదనం తో,అందంగా నింపి వేసవి తాపాన్ని మరియు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నట్టు సామజిక మధ్యమాలలో మరియు పత్రికలలో వార్త ప్రచురించిన విషయం విధితమే.అయినప్పటికీ ఆ మొక్కల గురించి ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా మొక్కల పై శ్రద్ధ చూపించి ,మొక్కలను పెంచి తద్వారా కాలుష్య నివారణ లో మున్సిపాలిటీ ద్వారా ముందడుగు వేసి ఇది కదా మున్సిపాలిటీ అంటే, ఇది కదా విజ్ఞానవంతుల పాలన అనే విధముగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

# అంజన యూత్ ఆధ్వర్యంలో వల్లభాయి పటేల్, పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు..



**సందేశం టైమ్స్ జగ్గయ్యపేట/చిల్లకల్లు,డిసెంబర్ 16.** చిల్లకల్లు గ్రామంలో అంజనా యూత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ ,పటేల్ పొట్టి శ్రీరాములు వారి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం పలువురు మాట్లాడుతూ వారి త్యాగాలను, ఆర్ ఈ దేశానికి అందించినటువంటి వివిధ ఫలాలను చిన్నారులకు యువతకు తెలియజేసి వారి త్యాగనిరతిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో.. అధ్యక్షులు ప్రతిఘటం.మల్లికార్జున రాజు , గుంజ ఏడుకొండలు, యాదగిరి , సుఖదేవ్ తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మాల ధారణ నేడు ప్రారంభం...



**సందేశం టైమ్స్ ,పెనుగంచిప్రోలు ,డిసెంబర్ 16.** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము నందు సోమవారం పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష మాలాధారణ సందర్భముగా ఆలయ అర్చకులు,ఆలయ పురోహితులు,వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ అమ్మవారి దీక్ష మాలధారణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించబడింది. మొదటి రోజు సుమారు 800 మంది దీక్ష స్వీకరించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకాల గ్రామ వాస్తవ్యులు కొత్తకోట వెంకట్రావు దీక్ష స్వాములకు ప్రసాదముల వితరణ చేసినారు. దీక్ష స్వాములకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు,ధర్మకర్తలు కాకాని అలేఖ్య,బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, దేవరకొండ .శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపి బాబు,సూపర్నెంట్ డి.వి.ఎన్ రాజు,లక్ష్మణ్, నాగేశ్వరావు, కార్యాలయ సిబ్బంది ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యావత్ తెలుగు ప్రజల ఆస్తి

1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు.




**మహా కుట్ర చేశారు**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్



బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనకు బీజేపీ అధిష్ఠానం ఘన స్వాగతం పలికింది. పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా నితిన్ నబిన్‌ను కార్యాలయంలోకి ఆహ్వానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నడ్డా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్‌కు హృదయపూర్వక అభినందనలు. మీ నాయకత్వంలో సంస్థ మరింతగా విస్తరిస్తుందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి పౌరుడికి చేరువ చేస్తారని నేను విశ్వసిస్తున్నాను. మీ పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని నడ్డా పేర్కొన్నారు. అంతేకాకుండా, "గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, మీ సంస్థాగత నైపుణ్యాలు బీజేపీ ప్రజాసేవ, దేశ నిర్మాణ ప్రయాణానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయి. బీజేపీ ప్రభుత్వ సంక్షేమ విధానాలను, పార్టీ సిద్ధాంతాలను మీరు మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలరు. మీ నూతన బాధ్యతలకు, విజయవంతమైన పదవీకాలానికి నా శుభాకాంక్షలు" అని జేపీ నడ్డా తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా నితిన్ నబిన్‌ను అభినందించారు. "బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్‌కు అనేకానేక అభినందనలు. మీ నాయకత్వంలో సంస్థ మరింత పటిష్ఠమవుతుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా వెళతాయని నేను విశ్వసిస్తున్నాను. మీ పదవీకాలం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అని అమిత్ షా అన్నారు. ఆదివారం బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబిన్, సోమవారం బాధ్యతలు స్వీకరించేందుకు న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఈ పదవిని చేపట్టిన వారిలో ఆయనే అత్యంత పిన్న వయస్కుడు కావడం గమనార్హం. ఆయన వయసు 45 సంవత్సరాలు. సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా


# కాంగ్రెస్ కు కాలం చెల్లిందని
# పల్లె ప్రజలు ఓటుతో తేల్చిచెప్పారు



వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో గద్దెనెక్కిందని, ఇప్పుడు ఆ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ... ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సైతం బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారని, ఇందుకు కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్ పార్టీకి ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ వైఫల్యాలే ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని ఉద్ఘాటించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయాలు సాధించిందని, కానీ నేడు కాంగ్రెస్ కనీసం సగం పంచాయతీలను కూడా గెలవలేకపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇది అధికార పార్టీపై పల్లెల్లో పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని వివరించారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అభయహస్తం కాదని, అదొక రిక్త హస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి రేవంత్ అసమర్థ పాలనలో అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను విడిపించే పోరాటంలో తమకు అండగా నిలుస్తున్న ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు పార్టీ బంగారు బాటలు వేస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# రూ.1000 కోట్ల ప్రాజెక్టులు సిద్ధం

తనను అరెస్టు చేసి అలాంటి ఒక స్టేషన్‌లోనే కూర్చోబెట్టారని ఆమె గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ మోడల్ పోలీస్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.509 కోట్లతో పలు భవన నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. త్వరలోనే రూ.179 కోట్లతో కొత్త నిర్మాణాలు, రూ.412 కోట్లతో గ్రేహౌండ్స్ భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేతిలో సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి వివరించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కార్యాలయాలు లేవని, వాటి నిర్మాణాలపై దృష్టి సారిస్తామన్నారు. కొత్త ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఎండీ రవిప్రకాశ్ నాయకత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో



కార్పొరేషన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగలేదని విమర్శించారు. హోంమంత్రి, ఉన్నతాధికారుల సహకారంతో రెండేళ్లలోపు నిర్దేశిత పనులన్నీ పూర్తి చేసి, సంస్థకు మరింత మంచి పేరు తీసుకొస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, కార్పొరేషన్ ఎండీ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలాదేవి రచించిన.. విద్యార్థులారా చెడు నడతలు వద్దు పాట ఆవిష్కరించిన :ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** విద్యార్థులు, యువత నేటి సమాజంలో ఎదుర్కొంటున్న దుష్పరిణామాలైన మాదకద్రవ్యాలు, బెట్టింగులు, ప్రేమ, ఆత్మహత్యలు, ర్యాగింగ్ వంటి సమాజ వ్యతిరేక కార్యకలాపాలపై జడ్ పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో ఆ పాఠశాల అసిస్టెంట్ పిడి డోలా శ్యామలా దేవి స్వీయ రచన స్వర కల్పన చేసిన విద్యార్థుల్లారా చెడు నడతలు నడవద్దు అనే పాటను ఉపాధ్యాయుల క్రీడోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత నేటి సమాజంలో ఎదుర్కొంటున్న మా దకద్రవ్యాల వాడకం, బెట్టింగ్, ర్యాగింగ్, ప్రేమలో మోసాలు, ఆత్మహత్యలు వంటి దుష్పరిణామాలపై అవగాహన అవసరమని తెలిపారు. సమాజంలో యువత మంచి మార్గంలో నడవడానికి నైతిక విలువలు, సామాజిక బాధ్యత చాలాముఖ్యమని తెలిపారు. ఈ పాట ద్వారా విద్యార్థులలో మంచి మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు, ఇలాంటి కార్యక్రమాలు యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి భావోద్వేగపూరిత, సందేశాత్మక పాటను రూపొందించిన డోలా శ్యామలాదేవికి, సహకారం అందించిన పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం మార్కాపురం నూతన జిల్లా సాధించిన విజయోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని బాయ్స్ హైస్కూల్ అసిస్టెంట్ పిడి డోలా శ్యామలాదేవి, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ




**కాశినాయన, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** "పేదరికం పై యుద్ధం ప్రకటించాడానికి చదువు ఒక్కటే మార్గమని "జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి పేర్కొన్నారు. సోమవారం కాశినాయన మండలం లోని బాలాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రధానోపాధ్యాయులు పల్లా దస్తగిరి బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖాసీం వల్లి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతీ పేదింటి బిడ్డ చదువులో బాగా రాణించి, తమ తల్లి దండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.తను జీవితంలో అనేక ఒడిదుడుకులను చవి చూశానని, అందుకే పేద విద్యార్థుల విద్య పట్ల శ్రద్ధ వహించి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. ప్రధానోపాధ్యాయులు దస్తగిరి బాబు మాట్లాడుతూ "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న "అని ఇలాంటి కార్యక్రమం లో భాగస్వామి కావడం పట్ల సంతోషం వెలిబుచ్చారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి, చక్కగా చదివి తమ జీవితానికి ఉన్నత బాటలు వేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్.బి.ఐ. ద్వారా రైతులకు చేయూత




**పోరుమామిళ్ల,డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ రుణాల ద్వారా రైతులకు చేయూతనందిస్తుందని ఎస్. బి.ఐ. మేనేజర్ ఎమ్.నరేంద్ర పేర్కొన్నారు.జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పోరుమామిళ్ల మండలం వెంకటాపురం లో రంగసముద్రం బ్రాంచ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రైతులకు ఎస్.బి. ఐ. అందించే రుణాలు పై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.బి.ఐ. చీఫ్ ఎమ్.నరేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డ్రిప్,రెయిన్ గన్, స్పింకర్లు, పాల ఉత్పత్తి, డైరీ వంటి రకరకాల రుణాలు తన బ్యాంకు అందిస్తుందన్నారు.ఆధునిక సాంకేతికతను వినియోగించి లాభదాయకమైన వ్యవసాయం చేయడానికి రైతులకు తమ సంస్థ రుణాలు అందిస్తుందని, వాటికి ప్రభుత్వం నుండి సబ్సిడీ వస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.రైతులు ఎస్. బి.ఐ. ద్వారా వివిధ రుణాలు పొందడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.పూర్తి వివరాలకు స్థానిక ఎస్.బి.ఐ. బ్రాంచ్ ను సంప్రదించాలని ఆయన తెలిపారు.అదేవిధంగా రుణాలు తీసుకునే రైతులు వాటికి ఎస్.బి.ఐ. ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవడం వలన రిస్క్ ఏమైనా జరిగితే పెద్ద మొత్తంలో డబ్బులు పొందవచ్చని, లేకుంటే మీరు కట్టే డబ్బులు ప్రీమియం కాలం పూర్తయిన వెంటనే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని ఎస్. బి.ఐ. మేనేజర్ తెలిపారు. అనంతరం బ్యాంక్ అధికారులు, రైతుల సందేహాలను నివృత్తి చేయడం తో పాటు పలు సలహాలు, సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎమ్.నరేంద్ర, పీల్డ్ ఆఫీసర్స్ టి.పీరయ్య,ఎన్. హరికృష్ణ , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

# గన్నవరంలో బగ్గుమన్న గ్రూపు కక్షలు




**గన్నవరం సందేశం టైమ్స్** గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవల్లో కంభంపాటి శ్రీధర్, కంభంపాటి రామ్మోహన్రావుకు గాయాలు.. నిన్న మర్లపాలెం గ్రామానికి వల్లభనేని వంశీ పరామర్శకు వెళ్లిన సందర్భంలో కంభంపాటి శ్రీధర్, రామ్మోహన్ రావు వంశీని కలిసి మాట్లాడిన వైనం.. మాజీ ఎమ్మెల్యే వంశీతో మాట్లాడమని కక్షతో మాపై గ్రామానికి చెందిన సాయి అతని తండ్రి దాడి చేశారని బాధితుల గోడు. మేము మొదటినుంచి టిడిపిలోనే ఉన్నాము, వంశి రెండుసార్లు పోటీ చేసినప్పుడు, మొన్న యార్లగడ్డ వెంకట్రావు పోటీ చేసినప్పుడు తెలుగుదేశం పార్టీకే చేశాము.. గ్రామంలో గ్రూపు రాజకీయాలు సృష్టించి రెండు వర్గాలుగా విభజించారు.. మమ్మల్ని తెలుగుదేశం పార్టీలోకి గ్రామ నాయకులు కలుపుకోవటం లేదు.

# వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**పొన్నలూరు, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, భద్రత చైతన్యాన్ని మరింతగా పెంచడం ప్రధాన లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. పొన్నలూరు మండల కేంద్రంలో ఆదివారం రహదారి భద్రత, హెల్మెట్ వినియోగంపై ఎస్సై కె. అనుక్ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అనుక్ మాట్లాడుతూ.. ప్రజలు హెల్మెట్ ను కేవలం జరిమానా నుండి తప్పించుకోవడానికి కాకుండా.. తమ ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా ఉపయోగించు కోవాల్సిన జీవిత రక్షక సాధనంగా భావించాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ధరించడం, అధిక వేగాన్ని నివారించడం, రోడ్డు నియమాలు పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడకపోవడం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి జాగ్రత్తలు ప్రతివాహన దారుడి బాధ్యత' అని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి విలువైన ప్రాణాలను రక్షించడంలో ప్రతి పౌరుడూ హెల్మెట్ ను అలవాటుగా మార్చుకుని ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించాలని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ప్రజలకు తెలియజేశారు. ప్రతి సంవత్సరం చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాలలో కేవలం హెల్మెట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలన రహదారి ప్రమాదాలలో తలకు తీవ్ర గాయాలపాలై, గోల్డెన్ అవర్స్ లో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

- తెలుగువారి కోసం పోరాడిన గొప్ప వ్యక్తి
- ఆయన త్యాగం మనలో స్ఫూర్తి నింపాలి : ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- అమరజీవి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన ఎమ్మెల్యే





**కందుకూరు,డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** శ్రీ పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా, సోమవారం కందుకూరు లోని వెంకటనారాయణ బజార్ లో ఆయన విగ్రహానికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కూటమి పార్టీల నేతలు సహా ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే వారి కోసం ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న లక్ష్యంతో, శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. అప్పట్లో మద్రాస్ రాష్ట్రంలో, తెలుగువారిని అనేక రకాలుగా అవమానించడాన్ని ఆయన తట్టుకోలేకపోయారని చెప్పారు. పొట్టి శ్రీరాములు త్యాగం మనందరిలో స్ఫూర్తి నింపాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు. పొట్టి శ్రీరాములు ప్రాణం త్యాగం చేసిన రోజును, ఆత్మార్పణ దినంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుత మహోన్నత రాజధాని అమరావతిలో కూడా అతిపెద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మురారి శెట్టి వెంకట సుబ్బారావు, కొత్తూరు వెంకట సుధాకర్, కాకుమాని ప్రవీణ్, మురారిశెట్టి శ్రీకాంత్, మోదడుగు వెంకటేశ్వర్లు,బిజెపి నాయకులు ఘట్టమనేని హరిబాబు, వరప్రసాద్, పార్టీ నాయకులు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీను, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీనివాసులు, షేక్ రూబీ, తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగానే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది





**ఒంగోలు, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం అవతరించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక సీ.వి.ఎన్ రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు,సంతనూతలపాడు శాసనస భ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, గిద్దలూరుశాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పూల మాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని 58రోజుల పాటుఆమరణనిరాహార దీక్ష చేశారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి 15 కేజీల కిలోల బరువు తగ్గిన తర్వాత ప్రజలందరూ కూడా ఆయనకు సంఘీభావం తెలిపి మహా ఉద్యమంలో పాల్గొన్నా రన్నారు.అమరజీవి పొట్టి శ్రీరాములుఆమరణ దీక్ష చేసి మరణించిన 10నెలల తర్వాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ప్రభు త్వం ప్రకటించిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మఅర్పణ దినోత్స వంగా గత సంవత్సరం అధికారికంగా ప్రభుత్వం ప్రక టించడంజరిగిందని ఆయన చెప్పారు.శ్రీపొట్టిశ్రీరాములు త్యాగానికి చిహ్నంగా అమరావతి రాజధాని లో 55 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన చెప్పారు.

# పిపిపి విధానంతో మెడికల్ కాలేజీల నిర్మాణం వలన పేద విద్యార్థులకు అదనంగా మెడికల్ సీట్లు,పేదలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయి

- మెడికల్ కాలేజీ పట్ల జగన్ కి చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్లలో పులివెందుల కాలేజీ ఎందుకు పూర్తి చేయలేదు?
- నేడు సంతకాల సేకరణ, ర్యాలీలు అంటూ ఫోర్జరీ సంతకాలతో డ్రామాలాడుతున్నారు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**ఒంగోలు, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** పిపిపి మోడల్ లో మెడికల్ కాలేజీ నిర్మాణం వలన పేద విద్యార్థులకు అదనంగా మెడికల్ సీట్లు పెరగడంతోపాటు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. కానీ వైసీపీ నేతలు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ మోడల్ లో నిర్మించే కాలేజీలకు పిపిపి ప్రభుత్వ వైద్య కళాశాల అని పేరు పెడతాం, ఉచిత ఓపి వైద్య సేవలు అందిస్తామన్నారు. మెడికల్ కాలేజీల పట్ల జగన్ కి చిత్తశుద్ధి ఉంటే 5 ఏళ్లలో పులివెందుల మెడికల్ కాలేజీ కూడా ఎందుకు పూర్తి చేయలేదన్నారు. గత ఐదేళ్లలో కనీసం 18 శాతం కూడా మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయలేకపోయిన జగన్ అండ్ కో నేడు సంతకాల సేకరణ, ర్యాలీలు అంటూ ఫోర్జరీ సంతకాలతో డ్రామాలాడుతున్నారని మండి పడ్డారు. వైసీపీ పాలన పాపాల వల్లే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన గాడిలో పెట్టి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు.

# పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందాలి





- డాక్టర్లు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచన
- ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకునేదిలేదు
- రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠినచర్యలు
- రూ.5 కోట్లతో ఆసుపత్రి ఆధునీకరణకు ప్రతిపాదన

**కందుకూరు, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది డాక్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించగా, ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు.రోగులనుంచి ఇటీవల కాలంలో పదేపదే ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించిన ఎమ్మెల్యే, ఎందుకు అలా జరుగుతోందో సిబ్బంది ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని తమ ప్రభుత్వం తాపత్రయ పడుతుంటే, విధుల్లో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కొంతమంది మొక్కుబడిగా డ్యూటీకి వచ్చిపోతున్న విషయం తనదృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే నలుగురు సిబ్బందికి మెమోలు జారీ చేసినా, మిగిలిన వారిలో మార్పు కనిపించడం లేదని అన్నారు. అలాగే శానిటేషన్ సిబ్బంది కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు హెచ్చరించారు. ఇకనుంచి రెగ్యులర్ గా ఆసుపత్రి నిర్వహణను పరిశీలిస్తానని, మరోసారి తప్పులు జరిగితే ఊరుకునేది లేదని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. వైద్య సేవలతోపాటు రోగులపట్ల మర్యాదగా, ప్రేమగా నడుచుకోవాలని సూచించారు.మొత్తంగా ఇక్కడికి వచ్చే రోగులకు కార్పొరేట్ తరహా వైద్యం అందేలా సిబ్బంది అందరూ కలిసిమెలిసి పనిచేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు.అన్ని రకాల వైద్య సేవలకు సంబంధించి మందులన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇంద్రాణికి సూచించారు. మందులు బయట తెచ్చుకోవాలని చీటీలు రాసిచ్చే విధానం ఉండకూడదన్నారు. వలేటివారిపాలెంలో కాలం చెల్లిన మందులను ఇటీవల తగలబెట్టినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.అలాకాకుండా ప్రతి ఒక్కరికి సరిపడే మందులన్నీ కచ్చితంగా ఇవ్వాల్సిందేనన్నారు. పేదల వైద్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చైనా పెట్టడానికి వెనుకాడటం లేదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఈ సందర్భంగా అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 850 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు అందాయని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం అందేలా, త్వరలో హెల్త్ కార్డులు ఇచ్చే ప్రక్రియ మొదలైందని చెప్పారు.

**ఆసుపత్రి ఆధునీకరణకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు...** కందుకూరులో ప్రస్తుతం ఉన్న వంద పడకల ఆసుపత్రిని అన్ని విధాలుగా ఆధునికరించేందుకు రూ.5 కోట్లతో ప్రతిపాదన తయారు చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. పడకల సంఖ్య పెంచడం, కొత్త డయాలసిస్ మిషన్లు, నూతన భవనాల నిర్మాణం, వైద్య సేవల కోసం పరికరాల కొనుగోలు, ఇంకా మరిన్ని అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. ఆ నిధులు మంజూరు అయితే, ఆసుపత్రి రూపురేఖలే మారిపోతాయన్నారు.పూర్తిగా మెట్ట ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గంలో, ప్రజలందరి ఆరోగ్య భద్రత లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు చెప్పారు.అంతకుముందు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఎమ్మెల్యే నాగేశ్వరావు తనిఖీ చేశారు. రోగులను ఆప్యాయంగా పలకరించి, వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో నీటివసతి, ఆహారం, శానిటేషన్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.రైతు బజార్ లో కూరగాయల షాపు యజమాని జి.రామకృష్ణ ఏరియా హాస్పిటల్ కు లక్ష రూపాయలు విలువచేసే బల్లలు బహుకరించారు. ఆసుపత్రిలో రోగుల కొరకు బల్లలు అందజేసిన జి. రామకృష్ణను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్లు శకుంతల, వెంకట్ రెడ్డి, రాంబాబు, కళ్యాణ్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, మువ్వల భూషయ్య, శిగా తిరుపాలు, వంకాయలపాటి మీనా కుమారి, పట్టణపార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్తలకు అండగా గంటా రవితేజ

## కష్టంలో ఉన్న కార్యకర్తల ఇళ్లకు వెళ్లి భరోసా - యువనేత సేవాభావానికి ప్రశంసలు....





**మధురవాడ :** ఎన్నికల సమయంలో కార్యకర్తల ఇళ్ల చుట్టూ తిరిగి హామీలు ఇచ్చే నాయకులను మనం తరచూ చూస్తుంటాం. కానీ ఎన్నికలు పూర్తయిన తర్వాత కార్యకర్తల కష్టసుఖాలను పట్టించుకోని పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితులకు భిన్నంగా, టిడిపి యువనేత, మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు గారి కుమారుడు గంటా రవితేజ తన సేవాభావంతో కార్యకర్తల మనసులు గెలుచుకుంటున్నారు. మధురవాడ 5వ వార్డు వైయస్సార్ కాలనీలో నివసిస్తున్న పక్కి విష్ణుమూర్తి అనే సామాన్య టిడిపి కార్యకర్త ఇటీవల పక్షవాతం బారిన పడడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే యువనేత గంటా రవితేజ స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, “నీకు ఏ అవసరం ఉన్నా నేను అండగా ఉంటాను” అంటూ భరోసా కల్పించారు. నాయకుడు స్వయంగా తమ ఇంటికి వచ్చి పరామర్శించడంతో ఆ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. అదేవిధంగా, అదే వార్డుకు చెందిన వాసు అనే మరో టిడిపి కార్యకర్త ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గంటా రవితేజ మధ్యాహ్న భోజన సమయం అయినప్పటికీ కార్యకర్త కోసం ఎదురుచూసి, ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో తమను ఆదుకోవడానికి నాయకుడు నేరుగా రావడం చూసి ఆ కార్యకర్తలు కన్నీటి పర్యంతమై యువనేతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాలను తెలుసుకొని వారికి భరోసా కల్పించడం ఒక నిజమైన నాయకుడి లక్షణమని, ఇలాంటి సేవాభావం కలిగిన నాయకులు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. గంటా రవితేజ చూపిస్తున్న ఆత్మీయతకు తెలుగు తమ్ముళ్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, యార్లగడ్డ జీవన్, ఓలేటి శ్రావణ్, వంక నూకరాజు, మొదలవలస సరస్వతి, మాధవ, కురుమోజి శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




**పుట్టిన రోజు: పుట్టినవారికే కాదు తల్లిదండ్రుల త్యాగానికి**

*సందేశం టైమ్స్ ప్రత్యేక కథనం*

పుట్టిన రోజు అంటే కేవలం కేక్ కట్ చేయడం, శుభాకాంక్షలు చెప్పుకోవడం మాత్రమే కాదు.ఆ రోజు ఒక జీవితానికి ఆరంభం. ఆ జీవితాన్ని ఈ అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకొచ్చిన తల్లిదండ్రుల త్యాగానికి గుర్తు చేసే దినం. ఒక శిశువు జన్మించడమంటే తల్లి తొమ్మిది నెలల పాటు భరించిన శారీరక, మానసిక వేదన. తండ్రి భుజాలపై పడిన బాధ్యతల బరువు. నిద్రలేని రాత్రులు, ఆర్థిక కష్టాలు, అనారోగ్యాలు, కన్నీళు ‍%ా% ఈ అన్నిటి మధ్య కూడా తమ సంతోషాన్ని పక్కన పెట్టి పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగే నిస్వార్థ ప్రేమే తల్లిదండ్రుల గొప్పతనం. పిల్లవాడు మొదటి అడుగు వేయడం నుంచి మొదటి అక్షరం నేర్చుకోవడం వరకు పాఠశాల చదువు నుంచి జీవిత పాఠాలు నేర్పడం వరకు ప్రతి దశలో తల్లిదండ్రులే అండగా నిలుస్తారు. అందుకే పుట్టిన రోజు అంటే “నాకు శు భాకాంక్షలు” అనే మాటతో సరిపెట్టకుండా “నన్ను ఈ లోకానికి తీసుకొచ్చిన అమ్మా – నాన్నకు ధన్యవాదాలు”అనే భావనను గుర్తుచేసుకునే రోజు కావాలి. ఈ రోజుల్లో పుట్టిన రోజులు హడావుడిగా మారాయి. ఖరీదైన వేడుకలు, ఆర్భాటాలు పెరిగాయి.కానీ మానవ విలువలు, కృతజ్ఞత భావం తగ్గిపోతున్నాయి.పుట్టిన రోజును ఒక అద్భుతంగా జరుపుకోవాలంటే, తల్లిదండ్రుల కాళ్లకు నమస్కారం చేయాలి,వారి ఆశీర్వాదం తీసుకోవాలి, వారి త్యాగాన్ని గుర్తు చేసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే ఒక మంచి పని చేయాలి అలా ప్రతి పుట్టిన రోజు ఒక వ్యక్తిగత వేడుకగా కాకుండా కుటుంబ విలువలకు, తల్లిదండ్రుల త్యాగానికి అంకితమైన పండుగగా మారాలి. పుట్టిన రోజు అంటే ఆనందం మాత్రమే కాదు%ా%బాధ్యతను గుర్తు చేసే రోజు అమ్మా నాన్న ప్రేమను మరింతగా గుర్తించే రోజు. అందుకే ప్రతి పుట్టిన రోజు ఒక అద్భుతం కావాలి ప్రతి పుట్టిన రోజు తల్లిదండ్రుల కోసం ఒక కృతజ్ఞతా దినంగా మారాలి

**సందేశం టైమ్స్ శెట్టి వెంకటేష్.**

# దివంగత మాజీ ప్రధానమంత్రి వాజ్ పేయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు






**కందుకూరు, డిసెంబర్ 15 (సందేశం టైమ్స్):** నెల్లూరు నగరం లో సోమవారం జరిగిన, దివంగత బిజెపి నేత, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి,సత్య కుమార్ యాదవ్, ఇతర నేతలతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వాజ్ పేయి తీసుకొచ్చిన సంస్కరణల వలన దేశఅభివృద్ధిలో అనేక మార్పులు వచ్చాయన్నారు. స్వర్ణ చతుర్భుజి పథకం ద్వారా జాతీయ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ప్రతిపక్షాలు కూడా వాజ్ పేయి పాలనను మెచ్చుకునేవారని, తన హాస్యచతురతతో విషయాన్ని చక్కగా వివరించేవారని అన్నారు. అలాంటి మహానేత విగ్రహాన్ని నెల్లూరులో ఆవిష్కరించటం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. అనేక సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం, వాజ్ పేయి గొప్పతనం గురించి పదేపదే చెబుతుంటారని అన్నారు.

# జోగిపేటలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు వైభవంగా నిర్వహణ



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15డిసెంబర్** జోగిపేట పట్టణ కేంద్రంలో సోమవారం అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు, పల్లకి సేవ శోభయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల గుండా సాగి అయ్యప్ప ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పేటయ్ తుల్లి ఆటలు, మహిళల కోలాటం, అయ్యప్ప దీక్షాధారుల శరణుఘోషలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామివారి పల్లకి సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆభరణాల ఊరేగింపు అనంతరం అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించి స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో మండల సంఖ్యలో భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరగాలి : సాధారణ పరిశీలకులు రవి నాయక్



**సందేశం టైమ్స్ డిసెంబర్ 15 :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ద్వారా చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్నగర్, మట్టంపల్లి, మేళ్లచెరువు, నేరేడుచర్ల, పాలకీడు మండలాల్లో జరిగే ఎన్నికల కోసం సర్పంచ్, వార్డు స్థానాల పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను స్థానికత తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుని కేటాయించారు. జిల్లాలో మూడవ విడతలో 146 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 1333 వార్డు సభ్యుల స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా, 22 సర్పంచ్‌లు, 157 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన 124 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 1176 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు 30 శాతం రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 1538 ప్రిసైడింగ్ అధికారులు, 2026 ఓపీఓలను పోలింగ్ విధుల కోసం ర్యాండమైజేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి.వి.అప్పారావు, డీపీఓ యాదగిరి అధికారులు పాల్గొన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times3-82, Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508206Gmail : sandeshamtimes@gmail.comWebsite: https://sandeshamtimes.comPublisher : MADDINENI NAGESWARA RAOAddress104, HILLS APARTMENT, Press (Name & Address)SUNDAY PRINTING PRESS3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH-522006